## లోకేష్ పాదయాత్రకు ఎలాంటి ఆంక్షలూ లేవు : ఎస్పీ

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** లోకేష్ పాదయాత్రకు పోలీసులు ఆంక్షలు పెడుతున్నారంటూ తెలుగుదేశం నేతలు చేస్తున్న ఆరోపనలు అవాస్తవమని జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి తెలిపారు. యువగళం పేరుతో నారా లోకేష్ తలపెట్టిన పాదయాత్రకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు స్పష్టం చేశారు. అయితే నిబంధనల మేరకు పాదయాత్ర నిర్వహించాలని సూచించారు. ఎక్కడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. ప్రభుత్వం, పోలీస్‌శాఖ అనుమతులు ఇవ్వకుండా వేదిస్తున్నారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఇలాంటి అసత్యప్రచారం మానుకోవాలని సూచించారు.

# సమస్యలు పరిష్కరించండి

### కలెక్టరేట్ ఎదుట 108 ఉద్యోగుల దీక్షలు

సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న 108 ఉద్యోగులు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఏళ్ల తరబడీ పనిచేస్తున్న 108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఈఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయడంతోపాటు గత సమ్మె సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ 108 ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల సంఘం నాయకులు ప్రదీప్, లక్ష్మినారాయణ, కిరణ్, రాజేష్, భావాసాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్ధేశపూర్వకంగా 108 వ్యవస్థను నీరుగారుస్తోందన్నారు. మరమ్మతులకు గురైన వాహనాలను రోడ్లపై తిప్పడం వాహన డ్రైవర్లకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. అలాగే థార్డ్‌పార్టీ ఏజెని అరవిందో సంస్థ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవగా పిఎఫ్ జీతం నుండీ కట్ చేస్తున్నా ఏజేన్సీ ఏమాత్రం చెల్లిచండం లేదన్నారు. గత సమ్మె సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహ్మన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరమ్మతులకు గురైన వాహనాలు, మందుల సరఫరా చేయడం లేదని ఇలాంటి పరస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే 108 ఉద్యోగుల ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ నాయకులతో జరుపుతున్న చర్చలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే నిరవధిక సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. 108 ఉద్యోగుల పోరాటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కాంజివరం సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 108 ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడంలో కీలపాత్ర పోషిస్తున్న 108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల భూముల కోసం పోరాడుదాం

**వ్యకాసం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి- పలమనేరు:** భూస్వాముల ఆక్రమంలో ఉన్న పేదల భూముల కోసం పోరాడుదామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు పిలుపు ఇచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయం సమీపంలో నియోజకవర్గంలోని భూసమస్యలపై భూసదస్సును బాధిత రైతులతో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు చిరంజీవమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్య వహించిన జిల్లా కావడంతో పాటు అనేక మంత్రులు, మేధావులున్నా చిత్తూరు జిల్లాలో కూడా నిరుపేదల కోసం దళితుల కోసం ఇచ్చిన భూములు లక్షలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమై పెత్తనందారులు ఆక్రమించుకున్నారని, వేలాది ఎకరాలు అక్రమంగా అనుభవిస్తున్నారని వాపోయారు. ఎస్‌ఈజెడ్, పారిశ్రామికీకరణ, నేషనల్ హైవే పేరుతో దళితుల భూములు లాక్కొని కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వకుండా 2013 భూసేకరణ చట్టం అమల్లో ఉండి కూడా వారికి ఎలాంటి పునరావసం కల్పించకుండా పెద్ద ఎత్తున భూములు లాక్కున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఇచ్చిన భూములకు పట్టాలు పేదల దగ్గర ఉన్నాయని భూములు మాత్రం పెత్తనం దారిచేతుల్లో ఉన్నాయని తెలిపారు. కొన్నిచోట్ల భూముల సాగులో పేదలు ఉన్నారని ఆన్లైన్లో పట్టాలు పొంది పెత్తనందారులు చేతుల అక్రమంగా అనుభవిస్తున్నారని తెలిపారు. అందుకోసం జిల్లాలో లక్షలాది ఎకరాల భూములు అన్యాకాంతమయ్యాయని వాటిని స్వాధీనం చేసుకొని మిగులు భూములు బంజర భూములు నిరుపేదలకు పంచిపెట్టాలని ఉద్దేశంతో భూసదస్సును నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆర్డీవో నెలరోజుల్లో లోపు అన్ని మండలాల్లో ఉన్న భూ సమస్యలను తహశీల్దార్‌తో సమావేశం జరిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. లేనిపక్షంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక పోరాటాలు, వంటావార్పు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ టిడిపి హయాంలోనూ వైసీపీ అయాయంలోనూ నాయకులు దళితుల భూములు ఆక్రమించుకొని కబ్జాకు గురవుతున్నాయని, ఇరు పార్టీలనాయకులు దళితుల చేతుల్లో భూములు ఉండకూడదని దుష్టఆలోచనతో ఉన్నారని తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలో జగనన్న కాలనీల కోసం ఎక్కువ భాగం దళితుల భూములే తీసుకోవడంతో పాటు పైసా నష్టపరిహారం కూడా ఇవ్వకుండా చేశారని అన్నారు. వందల ఎకరాలు భూములు అక్రమంగా పెత్తనందారుల చేతిలో ఉన్నా ఈ ప్రభుత్వాలకు కనపడలేదా అని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించి గద్దెనెక్కిస్తే నేడు వ్యవసాయ కూలీలు, దళితులకు తీవ్రఅన్యాయం జరుగుతుందని అన్నారు. బినామీల చేతుల్లోనూ భూసామ చేతుల్లోనూ ఫారెస్ట్ అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను జిల్లాలో ఉన్న భూములేని నిరుపేదలకు దళితులకు పంచిపెట్టే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎర్రజెండాలు చేతబోని ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకి సమస్యలను అర్జీలు రూపంలో అందించారు.

ఆర్డీవో శివయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని భూసమస్యలన్నిటినీ నెలరోజుల లోపల అన్ని మండలాల తహశీల్దార్లతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబుల్ రాజు, కెపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, నాయకులు గుర్రం సుబ్రహ్మణ్యం, అమర నారాయణ, పాకాల సుబ్రహ్మణ్యం, వెంకటరమణ బాలసుబ్రమణ్యం శివకుమార్ గణేష్ సుధాకర్‌తోపాటు 300 పైగా బాధిత రైతులు పాల్గొన్నారు.

ఆర్‌డిఓతో చర్చిస్తున్న వ్యకాసం రాష్ట్ర నాయకులు, రైతులు

ర్యాలీ చేస్తున్న నాయకులు

## స్పందనకు 233 అర్జీలు

స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 233 అర్జీలు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 217, విద్యాశాఖ 2, వైద్య మరియు ఆరోగ్య శాఖ 1, మైనారిటీ సంక్షేమ శాఖ 2, హౌసింగ్ శాఖ 8, ఉద్యాన శాఖ 3 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు జిల్లా కలెక్టర్, జెసి, డిఆర్ఓకి అందజేశారు. జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలుగైకొని పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎస్పీ

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:**

స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయరాదని జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 21 ఫిర్యాదులు అందాయి. వాటి వివరాలు చీటింగ్ – 4, కుటుంబతగాదాలు – 2 వేధింపులు – 3, ఆస్తి తగాదాలు – 11, పోలీసు సర్వీసెస్ 1 ఉన్నాయి. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డిఎస్‌పి మురళి, నీలకంటేశ్వర రెడ్డి, మధు పాల్గొన్నారు.

## వేగంగా స్పందన వినతుల పరిష్కారం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్**

'స్పందన' కార్యక్రమంలో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇది వరకు అందిన స్పందన వినతుల పరిష్కారంపై సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించారు. స్పందన కార్యక్రమంలో అందే వినతులను ఆన్లైన్లో నమోదు చేయించాలని, పరిష్కరించిన తర్వాత సరైన రికార్డులతో పరిష్కరించినట్లు నివేదిక ఇవ్వాలన్నారు. నాగాలమ్మ ఆలయం వెనుక భాగంలో మురుగునీటి కాలువలు నిర్మించాలని 44వ వార్డు ప్రజలు వినతిపత్రం సమర్పించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 8 వినతులు అందాయన్నారు. ఇంజనీరింగ్ –5, రెవెన్యూ, ప్రధాన కార్యాలయం, అకౌంట్స్ ఒక్కోటి చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

## ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తికావాలి : కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఇల్లు లేని వారందరికీ ఇంటి సౌకర్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం గహనిర్మాణాలను చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించుకుంటూ పనిచేసే జిల్లాకు నిర్ణయించిన మేరకు 24,859 గహ నిర్మాణాలను ఉగాది నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, హౌసింగ్ పిడి పద్మనాభంలతో కలిసి వీడియోకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక నిర్ణీత పద్ధతి ప్రకారం అందరూ కలిసి గహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్‌ఎల్, ఆర్‌సి స్థాయిలో ఉన్న గహనిర్మాణాలను వేగంగా పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా రిజిస్ట్రేషన్ కానివి ఉంటే పూర్తి చేయాలని బిబిఎల్, బిఎల్‌స్థాయిలో గహనిర్మాణాలు వేగవంతం చేసి పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు రోజువారి పర్యటనలు చేసి నిర్మాణాలు వేగవంతం చేయాలని, వారికి ఏవైనా నిర్మాణ సామాగ్రి అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి తెప్పించేలా చూడాలన్నారు. అదేవిధంగా గహనిర్మాణ కార్మికులు ఇతర ప్రాంతాల్లో నుంచి తెప్పించేందుకు తగిన ప్రయత్నాలు చేయాలని ప్రధానంగా తమిళనాడు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా కూలీలను పిలిపించుకొని పనులు పూర్తిచేసేందుకు ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ లేఅవుట్ల వద్ద ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చేసుకోవాలన్నారు. ప్రధానంగా రోడ్లు, విద్యుత్తు, నీరు తప్పనిసరిగా అందరికీ అందేలా చూడాలన్నారు.

## అర్హత ఉంటే ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

**డిప్యూటీ సీఎం నారాయణస్వామి**



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం

**ప్రజాశక్తి -పాలసముద్రం:** ఒకప్పుడు ప్రభుత్వ నుంచి ఏదైనా సంక్షేమ, అభివద్ధి పథకాలు రావాలంటే కాలు తిరిగేలా ప్రభుత్వ కార్యాలయంలో, రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.. ఇప్పుడు ఆ పరిస్థితులకు కాలం చెల్లిందని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్‌శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. సోమవారం వెంగల్ రాజుగుప్పం గ్రామసచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఎంపిపీ శ్యామల శివ ప్రకాష్‌రాజు, వైస్‌ఎంపీపీలు శేఖర్ యాదవ్, పుష్ప, సర్పంచ్ లిల్లీ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం నారాయణస్వామి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న సంక్షేమం, అభివద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం మూడేళ్లలో వారి కుటుంబానికి అందించిన బుక్లెట్‌ను అందించి ప్రజాసమస్యలపై ఆరా తీశారు. వాలంటీర్ల ద్వారా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి మరోసారి ఆయనను సీఎంగా గెలిపించాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడులేని విధంగా సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకువచ్చి పారదర్శకంగా, సమర్ధవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దక్కిందని తెలిపారు. అనంతరం వెంగళరాజు దళితవాడకు సిసి రోడ్డు, డ్రైనేజీ, కొత్తగా ఇల్లు లేనివారికి కొత్తగా ఇల్లు మంజూరు చేస్తామని హామీని ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ఎంపీడీవో ఎస్.విద్యావతి, ఏఈ మునిరాజ్, ఏపీవో బాల, ఐకేబి ఏపిఎం పరిధి మస్తాన్, నాయకులు మాజీ మండలాధ్యక్షురాలు ఇందిరమ్మ, ఆనందం, ప్రకాష్, కుట్టి, మనోహర్, బాబు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నా బిడ్డని కనిపెట్టండయ్యా...

**ఓ రిటైర్డ్ పోలీస్ ఆవేదన**

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:**

**ఒకటి, రెండు రోజులు కాదు రెండు నెలలు అవుతోంది తన బిడ్డ కనిపించడం లేదని ఫిర్యాదు చేసి తండ్రి తల్లడిల్లిపోతున్నాడు.. ఎలాంటి అలికిడి వచ్చిన ఫోన్‌రింగైనా తన బిడ్డోచ్చాడేమో.. అంటూ ఆత్రుగా ఎదురు చూస్తున్నాడు. ఇంతగా బిడ్డకోసం తండ్రి తపించిపోతున్నా కనిపించకుండా పోయిన బిడ్డకోసం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రెండు నెలలు అవుతున్నా పోలీసుల్లో ఏమాత్రం చలనం లేదు.**

పెనుమూరు మండలం చిన్న కలికిరి చెందిన రిటైడ్ ఎఆర్ ఎఎస్‌ఐ వెందామరన్‌కు సంతానం లేకపోవడంతో తన సోదరుడి కుమారుడు లక్ష్మిపతిని సొంత కుమారుడిగా చూసుకుంటూ చిన్ననాటి నుండీ అన్నీ తానై చదివిస్తున్నాడు. స్థానిక విజయం జూనియర్ కళాశాల్లో చదువుతున్న లక్ష్మిపతి గతేడాది నవంబర్ 16వ తేదీ కళాశాలకు వెళ్లిన ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతినా జాడ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అయితే నాటి నుండీ పోలీసులు చుట్టూ తిరుగుతున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని చేస్తాం.. చూస్తామంటూ.. కాలయాపన చేస్తున్నారంటూ రిటైడ్ ఎఆర్ ఎఎస్‌ఐ వెందామరన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తే తన సొంత ఖర్చులతో తన బిడ్డ ఆచూకి కోసం గాలిద్దాం అంటూ పోలీస్ ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి, ఎఎస్‌పిలను కలసి తన బిడ్డ ఆచూకీ కనిపెట్టాలంటూ వేడుకున్నాడు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 30ఏండ్ల పాటు పోలీసువృత్తిలో ఉన్న తనలాంటి వాడికే ఎలాంటి న్యాయం జరగలేదని రెండు నెలలుగా పోలీసులు తనబిడ్డ ఆచూకి గుర్తించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మండల పోలీసులు పట్టించుకోవడం లేదని పోలీస్ ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

విద్యార్థి లక్ష్మిపతి (ఫైల్‌ఫొటో), రిటైడ్ ఏఆర్ ఎఎస్‌ఐ వెందమారన్

## గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికార్లతో సమీక్షిస్తున్న జేసి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** 74వ భారత గణతంత్రదినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా జాయింట్‌కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జేసి మీటింగ్ హాల్‌లో ఏఎస్‌పి జగదీష్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ ఆదేశాల మేరకు ఈనెల 26న చిత్తూరు పోలీసు ఫెరడ్ గ్రౌండ్‌లో నిర్వహించే 74వ భారత గణతంత్ర దినోత్సవం వేడుకల నిర్వహణపై వివిధ శాఖాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ఈనెల 26న చిత్తూరు పోలీసు ఫెరడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారత గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించుటకు సబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని విజయవంతంగా నిర్వహించాడానికి సహకరించాలన్నారు. గ్రౌండ్‌కు సంబంధించి ఓరల్ ఇంచార్జిగా ఆర్డీఓ చూడాలని ఆదేశించారు. జాతీయ జెండా, స్టేజ్ డెకరేషన్, సెక్యూరిటీ, పెరేడ్ సంబంధించి ఏర్పాట్ల చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. 13 శాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్‌ను, అదేవిధంగా 13 శాఖలు ఏర్పాటు చేసే శకటాలకు సంబంధించి డిఆర్‌డిఏ పిడి పర్యవేక్షించాలన్నారు. పోలీసు, గహనిర్మాణం, డిఆర్‌డిఎ, జెడ్పి, డీఈఓ, సమగ్ర శిక్ష, ఫైర్ సర్వీస్, సివిల్ సప్లై, స్త్రీ శిశుసంక్షేమ, మున్సిపాలిటీ, వ్యవసాయ అనుబంధశాఖలచే శాఖలు శకటాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వివిధ శాఖలలో ప్రతిభ కనుబరించిన ఉద్యోగస్తులకు అందించే ప్రశంసా పత్రాలకు సంబంధించిన వివరాలను వెంటనే కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, హౌసింగ్ పిడిలు, డిఎంకె.తులసి, పద్మనాభం, ఆర్డీఓ రేణుక, జెడ్పి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఫైర్‌ఆఫీసర్ పెద్దిరెడ్డి, తహశీల్దార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, వివిధశాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సహకరించండి : కమిషనర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్లనిర్మాణాల కోసం లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం కమిషనర్ తేనబండ హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. అలాగే స్థానికంగా ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు వేగంగా ఇల్లు నిర్మించుకోవడానికి అవసరమైన ఇసుక, ఇటుకలు వేగంగా సరఫరా చేయించడానికి నోడల్ అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి ఇటుకల సరఫరా చేయించాలన్నారు. ఏలేవుట్లో ఎంతమందికి ఇటుకల అవసరం ఉందో గుర్తించి అందుకు తగినట్లు సరఫరా చేసేలా చూడాలన్నారు. ఇళ్లనిర్మాణం నిరంతరాయంగా సాగేందుకు వీలుగా అవసరమైన మేస్త్రీలను సమన్వయం చేసుకోవాలన్నారు. అవసరమైతే ఇటుకల బట్టీల యజమానులతో మాట్లాడి ఇటుకల సరఫరా చేయించాలన్నారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలన్నీ మార్చి 15వ తేదీ కల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో నోడల్ అధికారులు ఉదయం నుంచే వారికి కేటాయించిన లేఔట్లకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులకు మార్గ నిర్దేశం చేశారు.

గృహ నిర్మాణశాఖ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ అరుణ

## రైతుల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

**ప్రజాశక్తి- పలమనేరు :** పలమనేరు రూరల్ మండలంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలురకాల సమస్యలను ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే వెంకటేగౌడకి విన్నవించారు. పెంగరగుంట గ్రామపంచాయతీలోని మొసలిమడుగు గ్రామ సమీపంలోని కౌండిన్య నదికి గతంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ చెక్ డ్యాంను నిర్మించారని, వర్షాకాలంలో నదిలో నీరు ప్రవహించినప్పుడు ఈ నదికి ఆనుకొని ఉన్న పంటపొలాలపై నెలల తరబడి భారీ నీటిప్రవాహం ప్రవహిస్తోందని, దీని వలన రైతులు పండించిన వరి పంటలు సైతం నీటమునిగిపోవడమే కాక సారవంతమైన భూములు కూడా కోతకు గురై పూర్తిగా కొట్టుకుపోయి బండరాళ్ళు తెలిపోయి వ్యవసాయానికి పనికిరాకుండా పోతున్నాయని తెలిపారు. ఈవిధంగా కొన్ని సంవత్సరాలుగా వేసిన పంటలు చేతికందక రైతులు పూర్తిగా నష్టపోతూనేవున్నారు. ఈవిషయాన్ని స్వయానా పరిశీలించి ప్రభుత్వం ద్వారా వీటికి కావలసిన నిధులను సమకూర్చి కౌండిన్య నదిలోని నీరు పంట పొలాలపై వెళ్ళకుండా సిమెంటుతో నిర్మాణం చేపట్టేందుకు సహకరించి ప్రవాహానికి కొట్టుకుపోతున్న భూములను మళ్ళీ వ్యవసాయం చేసుకునేందుకు సహకరించి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే పలమనేరు పరిసర ప్రాంతాల్లో గత కొన్ని సంవత్సరాలుగా ఏనుగుల వలన పంట, ప్రాణనష్టాలు కూడా ఎక్కువగా జరుగుతూనే ఉన్నాయన్నారు. కందకాలను పునఃప్రారంభించాలని, శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం సరిపోవడం లేదని పెంచి ఇవ్వాలన్నారు. రైతులు మురగేష్, వేలుమురగ, పెరుమాళ్, ఈశ్వర, షతీష్, ఆర్మోగం, చిన్నబ్బ గౌడు పాల్గొన్నారు.

## మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యం

**ప్రజాశక్తి- పులిచెర్ల:** మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోకల తాతయ్య తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తాతయ్య మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను బతికించి చెట్లుగా పెంచాలన్నారు. ఎక్కడైతే చెట్లు ఎక్కువగా ఉంటాయో అక్కడ పర్యావరణ పరిరక్షణ ఉంటుందని, మంచి గాలి, వానలు పడి నీరు పుష్కలంగా దొరుతుందన్నారు.

## దోమల నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-యాదమరి:** దోమలను నివారిద్దాం.. అంటువ్యాధుల భారి నుంచి బయటపడదామంటూ యాదమరి కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్ లక్ష్మీనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేపనపల్లి హరిజనవాడలో డెంగీ పాజిటివ్ కేసు రావడంతో సిహెచ్ఓ ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకుంటే ప్రాణాంతకమైన జ్వరాలు భారిన పడకుండా ఉంటారని ప్రజలకు తెలియపరిచారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఆశ రమీల ఉన్నారు.

## దాతలు సాయం చేసి ఆదుకోండి

**ప్రజాశక్తి- రొంపిచెర్ల:** ఆపరేషన్ కోసం దాతలు ముందుకు వచ్చి సాయంచేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. బాధితుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన ఫైరోద్ అలీ 10 సంవత్సరాల క్రితం రొంపిచెర్ల గ్రామపంచాయతీకి వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య రఫీయా, పిల్లలు నేహా (13), తన్వీర్ ఆలీ(11), హాలియా(9)ఉన్నారు. వీరి కుమారుడు తన్వీర్ ఆలీకి పుట్టినప్పుడు నుండి గుండె జబ్బు ఉంది. దీనికి తోడు మలం వచ్చు రంధ్రం పూర్తిగా లేకుండా జన్మించాడు. దీనితో తల్లిదండ్రులకు కష్టాలు మొదలయ్యాయి గుండెజబ్బు కోసం హైదరాబాదులో ఆపరేషన్ చేపించారు. మలం బయటకు రావడానికి కడుపు పక్కన రంధ్రం ఏర్పాటు చేశారు. ఈసమస్యకు ఆపరేషన్ చేయడానికి చెన్నైకు చెందిన డాక్టర్లు రూ. 1.20లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు అయితే పనిచేసుకుని జీవనం తమకు ఆపరేషన్ చేయించే స్తోమత లేదని తల్లిదండ్రులు విలపించారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - రామకుప్పం:** మండలపరిధిలోని విజలాపురం గ్రామపంచాయతీ, బాలఓబనపల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ బాబురెడ్డి భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సైతం భూగర్భ డ్రైనేజీల వల్ల మురుగు నీరు నిల్వ చేరుతుండటంతో దోమల ఎక్కువై ప్రజలు రోగాల భారిన పడే ప్రమాదం ఉందన్నారు. కనుక రూ. 12లక్షలతో గ్రామలో డ్రైనేజీ పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపిపి సుబ్రమణ్యం, జెడ్పిటిసి నితిన్, వైసిపి కో కన్వీనర్ చంద్రారెడ్డి ఉన్నారు.

## నిజాయితీ చాటుకున్న విద్యార్థిని

**ప్రజాశక్తి- చౌడేపల్లె :** చౌడేపల్లి మండలం ఇటిక నెల్లూరుకు చెందిన విద్యార్థిని నిజాయితీని చాటుకుంది. చారాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పి. శరణ్య సోమవారం పాఠశాల మైదానంలో ఆడుకుంటుండగా ఆమెకు 12 గ్రాముల బంగారు గొలుసు దొరికింది. అమ్మాయి నిజాయితీగా తన తరగతి ఉపాధ్యాయుడు శివకుమార్ కు అప్పగించింది. హెచ్.యం.నరసింహులు, ఉపాధ్యాయుల సమక్షంలో గొలుసు పోగొట్టుకున్న వేదశ్రీకి అందించారు. నిజాయితీని చాటుకున్న విద్యార్థిని శరణ్యను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జిల్లాలోని వివిధ ప్రాధాన్యత గల స్థలాలకు వచ్చే భక్తులకు ఇతర ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సుఖప్రయాణం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, రోడ్డు సేఫ్టీ కమిటీ చైర్మన్ ఎం.హరి నారాయణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా రోడ్డుసేఫ్టీ కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు ప్రధాన రహదారులు ఉన్నాయని, వివిధ ప్రదేశాల నుంచి భారీ ఎత్తున వాహనాలు రావడం జరుగుతూ ఉంటుందని వారందరూ వారివారి స్థలాలకు క్షేమంగా చేరేలా తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఉన్న వాహనాలు సంఖ్యతో పాటు వరుసగా గత ఐదు సంవత్సరాల నుంచి జరుగుతున్న ప్రమాదాలు గాయపడిన వారి వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 39 ప్రమాదస్థలాలను గుర్తించడం జరిగిందని ప్రమాదాలు నివారించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం జరిగిందని అధికారులను ప్రశ్నించారు. దానికి సంబంధించి జిల్లారవాణా శాఖ అధికారి బసిరెడ్డి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలమనేరు- కుప్పం, పలమనేరు- పుంగనూరు, పలమనేరు- చెన్నై రహదారి వరకు, చిత్తూరు - పీలేరు సమీపం వరకు ప్రధాన రహదారులలో ప్రమాదాల నివారణకు కృషిచేయాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని పోలీసులు రవాణా శాఖ అధికారులు హైవే అధికారులు ఇంజనీరింగ్ అధికారులు ఇంకా ఏవైనా ప్రమాద స్థలాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు గుర్తించి చర్యలు తీసుకున్న 34 ప్రాంతాలతో పాటు మరో 19 ప్రమాద ప్రాంతాలను ప్రజారవాణా సంస్థ వారు గుర్తించడం జరిగిందని వాటి వద్ద కూడా హైవే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న రహదారులకు సంబంధించి భద్రత ఏర్పాట్లు అన్నిశాఖల వారు సమన్వయంతో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. గుర్తించిన ప్రమాద ప్రాంతాల వద్ద ఏర్పాటు చేయాలని భావించిన సూచిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేసి ప్రమాద రహిత రోడ్లుగా తీర్చిదిద్దాలని అన్నారు. అడిషనల్ ఎస్పీ జగదీష్, డిటిసి బసిరెడ్డి, ప్రజారవాణా అధికారి జితేందర్ రెడ్డి, జాతీయ రహదారి అధికారి మురళీకష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి నరేంద్రబాబు, డిడి మైన్స్ ప్రసాద్, రోడ్లు భవనాల అధికారీ, నేషనల్ హైవేస్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి- గుడిపల్లి:** మండలంలో సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. భారీ కేకులు కట్ చేసి అందరికీ పంచిపెట్టడంతో పాటు అన్నదానం చేశారు. టిడిపి మండలాధ్యక్షులు బాబునాయుడు, ఆర్.చంద్రశేఖర్, బెటప్ప నాయుడు, మునిరాజు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** మండలంలోని వెదురుకుప్పం గ్రామపంచాయతీ అంబేద్కర్ కూడలిలో టిడిపి నాయకులు పి.మోహన్ మురళీ ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకులు జరిగాయి. కార్యక్రమంలో టి.నాథముని, ఎస్.అనిల్, చంద్రబాబు రెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం :** మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్, మండల వాణిజ్య విభాగ అధ్యక్షుడు భాష్యం వంశీ చౌదరి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలుగుదేశం కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 10 మంది వికలాంగులకు లక్ష రూపాయలు విలువజేసే ట్రైసైకిలను పంపిణీ చేశారు.

**గంగాధరనెల్లూరు:** మండల కేంద్రంలో టిడిపి పార్టీ ఆఫీస్ వద్ద ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ పుట్టినరోజు వేడుకలు ను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, చల్లగుండ్ల వసంత్ కుమార్ సహకారంతో అన్న క్యాంటీన్‌లో 100వ రోజు పేదలకు 150 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**కార్వేటి నగరం:** స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు చంగల్రాయ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేందర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్, నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు నౌషాద్ ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు జరిగాయి.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** గ్రామాల అభివద్ధే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని వైఎస్సార్సీపీ ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని కనికాపురం గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులను మండల కన్వీనర్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి. చొరవతో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని అన్నారు. ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం చేపట్టిన ఘనత కూడా వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కనికాపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వచ్చిన సమాచార మేరకు ఎంపీపీ నిధులతో రూ. 5లక్షలు వెచ్చించి రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లోను ఇంటర్నల్ రోడ్డు 95శాతం పూర్తి అయ్యిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలారాణి, వెంకటేశులునాయుడు. ఎంపీటీసీ విమల, మాజీ ఎంపీటీసీ జేమ్స్ శేషాద్రి. మునిరామ నాయుడు, సంజీవ నాయుడు, నరసింహ నాయుడు, ఎంపీడీవో మోహనమురలి, పురందర్ పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాలపై అవగాహన సదుసు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో నైపుణ్యాలు ఉంటాయని వాటిని అభివద్ధి చేసుకుంటే ఉద్యోగ అవకాశాలు వాటంతట అవే వస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు సెట్విన్ చిత్తూరు వారు ఈకార్యక్రమాన్ని జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఎన్ఎస్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారద, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాశక్తి- గంగవరం:** దళితుల హక్కులను హరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఎస్సీ ఎస్టీ నాయకులు ఉద్ఘాటించారు. సోమవారం గంగవరం మండలం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ నాయకులు దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా డివి మునిరత్నం, బోయకొండయ్య మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమీషన్ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీలపై తిరుగుతున్న దాడులను నివారించాలన్నారు. గత ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చిన నేపథ్యంలో ప్రతి మండలంలో ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీలతోపాటు నెల చివరన ఎస్సీ,ఎస్టీ గ్రామాల్లో పౌరహక్కులు దినోత్సవం జరపాలని ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు ప్రారంభంలో కంటి తడుపు చర్యలుగా నిర్వహించి తర్వాత వాటిని నామరూపాల్లే లేకుండా చేసి దళితుల మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు. దీని వలన రాష్ట్రవ్యాప్తంగా విపరీతంగా దళితులు, మహిళలపై దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీలకు చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన వారే అంటీఅంటన్నట్టుగా వ్యవహరించడం చూస్తుంటే కంచె చేను మేసినట్లు ఉందని అన్నారు. బైరెడ్డిపల్లి మండలం అలపల్లి గ్రామంలో దళితులు ప్రవేశించే రోడ్డుకు ముళ్ళకంపలు వేయించిన అగ్రకుల పెత్తందారులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని తహశీల్దారు మురళీకష్ణకు సమర్పించిన మెమోరాండంలో విన్నవించారు. ఆ మండల అధికారులు గ్రామాన్ని సందర్శించి అటువంటి అనాగరికమైన చర్యలకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, ఈశ్వర్, మురళి, వేలయుధం, రెడ్డప్ప, పార్థసారథి, కవిత, టీవీ.రమణ, జై రామయ్య, సుబ్రహ్మణ్యం రాజామణి, సోము, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

**ప్రజాశక్తి-పలమనేరు:** రానున్న ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. రూరల్ మండలంలోని పెంగర గుంట పంచాయతీ పరిధిలో పెంగరగుంట, కోతిగుట్ట, జంగాలపల్లి, ఏటిగడ్డ ఇండ్లు గ్రామాల నందు "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం వైసీపీ అని.. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని తెలిపారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, జెడ్పిటిసి మల్లికా రంగనాథం, ఎంపీపీ రోజా, రూరల్ మండల అధ్యక్షులు బాలాజీ నాయుడు, నాయకులు సచివాలయం కన్వీనర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాటర్ ఫిల్టర్ వితరణ

**ప్రజాశక్తి- రామకుప్పం:** మండల పరిధిలోని విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాటర్ ఫిల్టర్‌ను వితరణ అందించారు. వైద్యం కోసం వచ్చే పేదరోగులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో వాటర్ ప్యూరిఫైడ్ ఫిల్టర్‌ను గోవిందపల్లి గ్రామానికి చెందిన సుభాష్ సోమవారం ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగాప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, డాక్టర్ అల్తాఫ్, బాలు, భానుప్రకాష్ దాతకు ధన్యవాదాలు తెలిపారు.

## పురుగుల నివారణకు వేపగింజల కషాయం

**ప్రజాశక్తి- రొంపిచెర్ల:** వ్యవసాయ పంటలలో పురుగులను నివారించడానికి వేపగింజలతో తయారు చేసిన కషాయాన్ని పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారిని సుధారాణి అన్నారు. సోమవారం వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రొంపిచెర్ల రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఐదు కిలోల వేపగింజలను నల్లగొట్టి ఒక నూలు గుడ్డలు కట్టి 10లీటర్ల నీళ్ల బకెట్లో 24 గంటలు నానబెట్టాలన్నారు. అనంతరం ఆ గుడ్డను తీసి 500గ్రాముల గుంగుడే కాయల కషాయాన్ని కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. దీనివలన పురుగులు ఉత్పత్తి కాకుండా ఉంటాయన్నారు. పంటలకు ఎలాంటి పురుగు వ్యాపించదని తెలిపారు. దీనివలన పంటలో ఉన్న మిత్ర పురుగులను కూడా కాపాడుకోవచ్చు అన్నారు. అలాగే వ్యవసాయ పంటలను నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఖాదర్ వల్లి, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ నాయక్, సుజాత, నర్మద, రైతులు పాల్గొన్నారు.

### యువగళం పాదయాత్ర
## విజయవంతం కావాలి

**ప్రజాశక్తి- యాదమరి:** యువగళం పాదయత్ర విజయవంతం కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, చిత్తూరు జిల్లా పరిశీలకులు పెళ్లకూరు శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు 400రోజుల పాటు 4వేల కిలోమీటర్ల పాదయాత్రపై బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, టిడిపి శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి. హేమగిరి, మండల అధ్యక్షుడు మొరార్జీ యాదవ్, ప్రధానకార్యదర్శి వెంకటేష్ రబీ, ఉపాధ్యక్షుడు సుభాష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- యాదమరి:** పిఆర్‌టియు టీచర్స్ యూనియన్ కేలెండర్, స్టికర్ కేలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి రుక్మిణీమ్మ, హెచ్ఎం భాస్కర్ రావు, పిఆర్‌టియు రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ అధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి హిమబిందు, శివప్రసాద్, సురేష్ రెడ్డి, మోహన్ కుమార్, మురళిబాబు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం'

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** ప్రజా సమస్యల పరిష్కరించే వేదిక గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం అని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని కీరమంద పంచాయతీ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకొల్లు రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండల పరిధిలోని జాతీయ రహదారిలోని రామాపురం సమీపంలో ఎస్సై వెంకట నరసింహులు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాసర్లపల్లి నుండి గంగవరం మండలానికి వెళ్తున్న ఆటో తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని గుర్తించి మద్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం తరలిస్తున్న శివన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి- సోమల :** మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయరాం మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ కీలకపాత్ర పోషించి స్వాతంత్రాన్ని సాధించిన వారిలో ఒకడని అలాంటి దేశనాయకుల భావాలను విద్యార్థులు పునికి పుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 25న జాతీయ ఓటరు దినోత్సవం

**ప్రజాశక్తి- సోమల:** జనవరి 25వ తేదీ బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని మండలంలోని బిఎల్వోలు, వీఆర్వోలు ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌బాబు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీటీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రతి ఓటరు కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఓటరు దినోత్సవం రోజు నూతన ఓటర్ల నమోదు, అవగాహన, మార్పులు చేర్పులు చేపట్టాలని కోరారు. గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రజలకు ఓటు విలువను తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని బాలాజీ అన్నారు. మండలంలోని దేరాకండ్రిగ గ్రామానికి చెందిన బాలాజీ కటుంబ సభ్యులు తన తల్లిదండ్రులు గురవయ్య నాయుడు, నరసమ్మల జ్ఞాపకార్థం సఫమవారం డీఎంపురం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 40మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైనవిద్య, క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన వారే అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు వారు ఉన్నారని గుర్తు చేశారు. పాఠశాల హెచ్ఎం నమ్మశ్శివాయ, ఉపాధ్యాయులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి

**ప్రజాశక్తి-సోమల:** సోమల పంచాయతీ ముంద్రివారిపల్లి గ్రామానికి చెందిన ఎం రెడ్డి బాబు(9) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామస్థులు కథనం మేరకు.. ముంద్రివారిపల్లి గ్రామానికి చెందిన నరసమ్మ ,గంగాధర్ దంపతులకు ఇద్దరు మగపిల్లలు సంతానం. వీరిలో పెద్దవాడు రెడ్డి బాబు అదే గ్రామంలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మరొక కుమారుడు మూడో తరగతి చదువుతున్నాడు. బాలుడి అవ్వ ఊరిలో పశువుల పండగ నిర్వహిస్తుండడంతో ఉత్సాహంగా పండుగకు వెళ్లాలని ఇంటి వద్ద ఉన్న ఆవులను తోలుకొని పొలం వద్దకు వెళ్లాడు. బాలుడు వెంట అవ్వ కూడా వెళ్ళింది. సుమారు ఉదయం 11 గంటలకు ప్రాంతంలో ఆవును చెరువు నీటిలో కడిగేందుకు ప్రయత్నిస్తూ ఉండగా ప్రమాదవశాత్తు రెడ్డి బాబు నీటిలో పడి మునిగిపోయాడు. వెంటనే బాలుడి అవ్వ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చి బాలుని నీటిలో నుండి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే రెడ్డి బాబు మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. దీంతో ముంద్రి వారి పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడు చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్ తన వంతు సాయంగా బాలుడి తల్లిదండ్రులకు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేసి సంతాపాన్ని తెలియజేశారు. ఎంఈఓ కేశవ పిళ్ళై మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

**IN THE COURT OF THE VIII ADDL. DISTRICT JUDGE,CHITTOOR**
**O.E.P. NO.1 OF 2020**
**O.S. No. 87 OF 2018**

Between
**V.J.Balaji** ...Decree Holder
And
**M.Nagarajaiah** ...Judgment Debtor

**RULE 54 NOTICE**
**JUDGEMENT DEBTOR**

**M.Nagarajaiah,** S/o M.Rajanna, Correspondent,Vidya Vihar English Medium Shcool,C.B.Road,Chittoor Town and Dist and residing at D.No.15-2810/1,Bharath Nagar, Chittoor Town ad District,AP
Sir,Please take notice that the above named D.Hr. filed E.P against you for realization of EP Amount and same is posted to your apperance on 21-02-2023. Hence you are directed appear before the above said court on 21-02-2023 at about 10-30 A.M and file your objections if any either in person or through an advocate, otherise the matter will be decided exparte.

**Sd/- T.K.SUNDARA KUMAR**
Advocate for D.Hr
Chittoor, Date: 23.01.2022